క్లుప్తంగా

మైనర్లు వాహనాలు నడపరాదు



మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు

పార్వతీపురంటౌన్: మైనర్లు వాహనాలు నడపరాదని, వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని పార్వతీపురం టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని రోడ్లపై ఆదివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వారి తల్లిదండ్రులకు, మైనర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే వాహనం యజమాని, తల్లిదండ్రులు కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- ఎంపీపీ ప్రమీల



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

పాచిపెంట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీపీ ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం జరిగిన వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని సంపదలలో కన్నా విద్యా సంపద గొప్పదని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తకాలు, పేపర్ల పఠనంతో పాటు చదివిన వాటిని మననం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉదయ్‌భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు కొండల రావు, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి విద్యాకానుక పంపిణీ



పాఠశాలలకు చేరవేస్తున్న పుస్తకాలు

సీతానగరం: పాఠశాలల పునఃప్రారంభం రోజు నుంచే విద్యార్థులకు పండగవాతావరణంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ల ఆధ్వర్యంలో విద్యాకానుక పంపిణీ చేస్తామని ఎంఈఓ జి. సూరిదేముడు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యాకానుక కిట్లు ఇప్పటికే స్కూల్ పాయింట్లకు సీఆర్పీల సహకారంతో పాఠశాల మండలంలోని ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ పాఠశాలలు పనిచేస్తాయన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ: జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. గ్రామ సచివాలయాల సిబ్బందితో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందించే సహకారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలన్నారు. నిర్మాణాలు చేపట్టిన వారికి బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నామన్నారు. ఈ నెల 30 నాటికి శతశాతం నిర్మాణాలు పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలన్నారు.

వర్మీకంపోస్ట్ తయారీకి చర్యలు



ఎస్‌డబ్ల్యూపీసీ ఫిట్‌లలో పశువుల పేడ, గెత్తం వేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

తెర్లాం: స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం)లో వర్మీకంపోస్ట్ తయారీకి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్డీ రాంబాబు ఆదేశాల మేరకు ఆదివారం పంచాయతీ ఈఓ. సూరిబాబు పర్యవేక్షణలో గ్రీన్ అంబాసిడర్లంతా కేంద్రంలోని ఫిట్‌లలో పశువుల పేడ, గెత్తం వేసే పనులు చేపట్టారు. ఇక్కడ తయారయ్యే ఎరువును రైతులకు రాయితీపై అందజేసి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

దీర్ఘాయుష్మాన్ భవ..!

- అందరికీ ఆరోగ్యమే ఫ్యామిలీ డాక్టర్ విధానం
- గ్రామాల్లోనే మెరుగైన వైద్యం
- వైద్యసేవల్లో జిల్లాలో మొదటిస్థానంలో పార్వతీపురం నియోజకవర్గం
- 104 వాహనాల్లోనే 14 రకాల పరీక్షలు
- అందుబాటులో 67రకాల మందులు
- నియోజకవర్గానికి 6 వాహనాలు
- ఇంటింటికి వైద్యసేవలపై ప్రజలు హర్షం



పార్వతీపురం మండంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పార్వతీపురంటౌన్:

వ్యాధుల బారిన పడితే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందనే బెంగ ఇంకపై ఉండబోదు. నాణ్యమైన వైద్యం ఇంటి తలుపుతడుతోంది. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొత్త ఒరవడికి నాంది పలికారు. ఇందులో భాగంగా ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు ఇంటి వద్దే వైద్యం(ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్) అందించేందుకు శ్రీకారం చుట్టారు. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తిస్తే సకాలంలో చికిత్స ద్వారా కోలుకునే అవకాశం ఉంటుందని గ్రహించి ఆ మేరకు చర్యలు చేపట్టడం విశేషం.

ఖాళీ పోస్టుల భర్తీ

రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు రూ. కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ విషయంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాజీ లేని నిర్ణయాలు తీసుకోవడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కార్పొరేట్ వైద్యం ప్రతి ఒక్కరికీ చేరువవుతోంది. దాదాపు 4 వేల వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాల్లోనూ వైద్యసేవలు పొందే అవకాశం కల్పించడం విశేషం. నాడు–నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో ఆత్యాధునిక సదుపాయాల కల్పనకు నడుం బిగించారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్యసిబ్బంది. పోస్టులను భర్తీ చేశారు. ఈ క్రమంలో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇంటి వద్దకే వైద్యం అనే నినాదంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. వచ్చే ఏడాది ఉగాది నుంచి పూర్తి స్థాయిలో కార్యక్రమం అమలు కానుంది.

డేటాయాప్‌లో రోగుల వివరాలు

ఫ్యామిలీ డాక్టర్స్ గ్రామపర్యటనకు ముందురోజు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది ఆ గ్రామంలో పర్యటిస్తారు. ప్రతి ఇంటా ఆరోగ్య సర్వే నిర్వహిస్తారు. 14 రక్తపరీక్షలతో పాటు వివిధ ప్రాథమిక వైద్య పరీక్షలు చేపడతారు. ఇందుకు సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాల డేటాను ఎఫ్‌పీసీ యాప్‌లో పొందుపరుస్తారు. కుటుంబంలోని వ్యక్తుల వివరాలను పూర్తిస్థాయిలో డేటా యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా నెలకు రెండుసార్లు ఇంటివద్దకే వైద్యం కార్యక్రమం నిర్వహిస్తారు. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంతో పాటు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు.

నియోజకవర్గంలో వాహనాలు ఇలా	
మండలం	వాహనాల సంఖ్య
పార్వతీపురం	2
సీతానగరం	2
బలిజిపేట	2

ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పింది



పదేళ్లుగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాను. విజయనగరం ప్రభుత్వాస్పత్రి, పార్వతీపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాను. స్పెషలిస్టుకు చూపించి బయట ప్రైవేట్ ఆస్పత్రిలో మందులు వాడేవాడిని. 104 వైద్యసేవలతో పాటు ప్రస్తుతం ఫ్యామిలీ ఫిజీషియన్ రావడంతో చూసి మందులు వాడుతున్నాను. ఖర్చు లేకుండా వైద్యసేవలు పొందుతున్నాను.

– రేగు సూర్యనారాయణ, పార్వతీపురం మండలం

బీపీకి మందులు ఇస్తున్నారు



నాకు బీపీ ఉంది. గతంలో పార్వతీపురంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేదానిని. నెలకు రూ.రెండు వేల వరకు ఖర్చయ్యేది. ఇప్పుడు 104, ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా నెలకు సరిపడా ఉచితంగా మందులు ఇస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేవు. గ్రామాల్లోనే మంచి వైద్యం అందిస్తున్నారు.

– నాయుడు సూరీదమ్మ, పార్వతీపురం మండలం

ఇంటింటి కుళాయి పనులు వేగవంతం



అంటిపేటలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈ పవన్‌కుమార్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో జరుగుతున్న ఇంటింటి కుళాయిల నిర్మాణం వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలోని బగ్గందొరవలస, అంటిపేట, వెన్నెలబుచ్చింపేట గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీసుకున్న చొరవ కారణంగా ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం నిధులు కోట్లాది రూపాయల వ్యయంతో మండలంలోని అన్నిగ్రామాలకు ఇంటింటి కుళాయిలు, ఇతర నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, పైప్‌లైన్లు వేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో అంటిపేట పంచాయతీ వెంకటాపురం, వెన్నెలబుచ్చింపేట, అంటిపేట గ్రామాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణం పనులు పూర్తి కావచ్చాయని తెలియజేశారు. బగ్గందొరవలసలో మక్కువ చినభోగిలి బీటీరోడ్డు వెడల్పు పనులు జరుగుతున్న కారణంగా వేసిన ఇంటింటి కుళాయిల నిర్మాణాలను తొలగించడంతో తాగునీటికి ఇబ్బందులు వచ్చాయని, పైపుల మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దళారులు లేని సంక్షేమపాలన



గంగాడలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: దళారులు, రాజకీయ జోక్యాలు, అవినీతి, అక్రమాలు లేకుండా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటింటికీ అందిస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలం గంగాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి పాలిస్తున్నారని అన్నారు. అందుకు అనుగుణంగా సచివాలయం, ఇలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రజల వద్దకు పాలన అందించాలనే సంకల్పంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గడపకు వెళ్లి గడిచిన కాలంలో ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని తెలియపరచడం, అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటే అటువంటి వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు చేపట్టేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

అభివృద్ధికీ పెద్దపీట

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ఈ ప్రభుత్వంలో పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన ఏ విధంగా ఉందనేది ప్రజలనుంచి అడిగి తెలుసుకుని వారికి కావలిసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. స్థానికంగా ఉండే సమస్యలను అక్కడిక క్కడే పరిష్కరించేదిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు సుభిక్షమైన పాలన అందించేందుకు జగన్ మోహన్ రెడ్డి పాటుపడుతున్నారని అటువంటి నాయకుడిని ఆశీర్వదించి రానున్న కాలంలో మళ్లీ ఆయననే సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్ కె.మోహనరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు జి.గంగయ్య, సూర్యనారాయణ, బి.నారాయణరావు, ఎస్.జగన్, జి.వెంకటినాయుడు, మోహన్, సూర్యనారాయణ, వి.గురురాజు, జి.జగన్, ఎస్.కామేష్, మండలంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పూర్తయిన బైపాస్ రోడ్డు



పూర్తయిన సాలూరు బైపాస్‌రోడ్డు

- మంత్రి రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న సాలూరు పట్టణ వాసులు
- రూ. 81 కోట్లతో పనులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర చొరవతో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో సాలూరు వాసుల దశాబ్దాల నాటి కల ఎట్టకేలకు నెరవేరినట్లైంది. సాలూరు మీదుగా (ఆంధ్రా – ఒడిశా జాతీయ రహదారి 26) నిత్యం పెద్ద పెద్ద వాహనాలు రాకపోకలు సాగించడంతో నిత్యం ఆ ప్రాంత వాసులు దుమ్ము, ధూళితో ఇబ్బంది పడేవారు. రణగొణ ధ్వనులతో కంటిమీద కునుకు లేకుండా గడిపారు. సాలూరు పట్టణంలోకి పెద్ద వాహనాలు రాకుండా బైపాస్ నిర్మించాలని పట్టణ వాసులు పలుమార్లు కోరారు. గత టీడీపా పాలకులు కనీసం పట్టించుకోలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బంది గురించి తెలుసుకున్న ప్రస్తుత మంత్రి పీడిక రాజన్నదొర బైపాస్ నిర్మాణానికి ఉపక్రమించారు. దుగ్గిసాగరం నుంచి నెలిపర్తి మీదుగా జీగిరాం వరకు 16 ఎకరాల భూసేకరణ చేసి సుమారు 5.9 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించారు. ఇందుకోసం రూ. 81 కోట్లు మంజూరుకాగా.. కాకులతోట వద్ద బ్రిడ్జి, బైపాస్ నిర్మాణానికి రూ. 48 కోట్లు, భూ సేకరణకు 33 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. కోర్టు వివాదాల కారణంగా నిర్మాణం కొంత ఆలస్యమైనప్పటికీ, రాజన్నదొర ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణం పూర్తయింది. తాజాగా దుగ్గిసాగరం జంక్షన్ వద్ద జాతీయ రహదారికి అనుసంధానం చేసే ప్రక్రియ దాదాపు పూర్తయింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నారుమళ్లలో మట్టినమూనాలు చేయించాలి

సీతానగరం: ఖరీఫ్‌సీజన్‌లో వరినారు వేయాల్సిన భూములు దుక్కి వేస్తున్న సమయంలోనే రైతులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సహకారంతో మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ నీటి వనరులున్న గ్రామాల రైతులు వరినారు వేయడానికి నారుమళ్లలో దుక్కి చేస్తున్నారని, ఖరీఫ్ సాగు చేయాల్సిన భూములతో పాటు వరినారు మళ్లలో మట్టిలో సారవంతాన్ని తెలుసుకుని ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు అవసరమైన ఎరువుల వాడకంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే వరియదలు వేసే భూములను వీఏఏలు పరిశీలించి మట్టి నమూనాలు సేకరించాలని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, వ్యవసాయ పనిముట్లు, తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడుల సాధనకు, కలుపు నివారణ చర్యలు తీసుకునేందుకు రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రగతి సేవా సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో వృద్ధులకు కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. వృద్ధులు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారంతా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా వనం గుడి వార్షికోత్సవం

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలస గ్రామంలో దుర్గ గుడి (వనం గుడి) ఏడవ వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. అలాగే గుడి ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.

అప్పయ్యపేటలో పారిశుద్ధ్య పనులు



ట్రాక్టర్‌లో చెత్త వేస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేటలో సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎంపీటీసి బి.కుసుమ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు జరిగాయి. ఈ మేరకు వారు మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమం అమలులో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి, విస్తరణ అధికారులు ఇచ్చిన సూచనల మేరకు గ్రామంలోని కాలువల్లో నాలుగు రోజులుగా పారిశుద్ధ్య పనులు చేయించామన్నారు. రోడ్డుపై పడేసిన చెత్తకుప్పలను ఆరబెట్టి తడిపొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్‌తో దూరప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. అలాగే ప్రజల అవసరాలకు అవసరమైన నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

డైట్ కళాశాల ఏర్పాటు చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో డైట్ కళాశాల ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2021–22 విద్యా సంవత్సరంలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ కళాశాలలో తాత్కాలికంగా డైట్ కళాశాల ఏర్పాటుకు రూ.35 లక్షలు మంజూరయ్యాయని, కళాశాల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అయినా డైట్ కళాశాలను గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

వరి విత్తనాలు సిద్ధం



ఆర్‌బీకేలో నిల్వ ఉంచిన వరి విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ సింహాచలం

భామిని: ఖరీఫ్‌లో రైతుల అవసరాల మేరకు వరి విత్తనాలను సిద్ధం చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి కొర్ను సింహాచలం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మండలంలోని 8 ఆర్‌బీకేలకు 15 టన్నుల వరి విత్తనాలు చేరాయన్నారు. ఎంటీయూ–1061 రకం విత్తనాలు 606 ప్యాకెట్లు, ఆర్‌జీఎల్–2537 రకం 212 ప్యాకెట్లు, ఎంటీయు–1064 రకం 36 ప్యాకెట్లు వచ్చాయన్నారు. ఇతర రకాల విత్తనాల కోసం ఇండెంట్లు పెట్టామని, అవి త్వరలోనే వస్తాయని తెలిపారు. విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విత్తనాల కోసం రైతులు ఆర్‌బీకేలలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులకు జ్ఞాపికలతో సత్కరించిన గ్రామ పెద్దలు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆదివారం ఘనంగా సత్కరించారు. పదో తరగతిలో 580 మార్కులు సాధించిన కిషోర్‌బాబు, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 428 మార్కులు సాధించిన కొప్పర మహాలక్ష్మి, సెకండ్ ఇయర్‌లో 980 మార్కులు సాధించిన ముప్పల విశాలక్షిని సర్పంచ్ గేదెల సత్యవతి, హెచ్‌ఎం శ్రీను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ యువత, ఆర్కే అకాడమీ అధ్యాపకుడు చంద్రశేఖర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

బొబ్బిలి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు.

సంస్థ సభ్యులంతా మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమలో సంస్థ సభ్యులు గోవిందనాయుడు, చంద్రినాయుడు, సత్తిరాజు, సత్యనారాయణ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని మెంటిపేట, మల్లిఖార్జున కాలనీలో తాగునీటి సరఫరాలో సోమవారం అంతరాయం ఏర్పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా పైపులైన్ దెబ్బతిందని, దీని మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయనున్నామన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



రైతులకు నవధాన్యాల కిట్లను అందజేస్తున్న చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కె.పాడు గ్రామానికి చెందిన రైతులకు గుమ్మలక్ష్మీపురం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు ఆదివారం నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం మండల కో–ఆర్డినేటర్ భూషణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారావు మాట్లాడుతూ.. వర్షాలు అనుకూలంగా ఉండటం వలన నవధాన్యాల విత్తనాలను పొలంలో వేసుకోవాలని, వీటిని ముందుగా పొలంలో వేసుకోవడం వలన భూమి సారవంతం అవుతుందని, ప్రధాన పంటలకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని అన్నారు. ఫలితంగా ఏవిధమైన రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదని, దిగుబడి కూడా పెరుగుతుందని అన్నారు.